సాక్షి ఖమ్మం
సోమవారం । 31 । మార్చి । 2025



గాలిలో ప్రాణాలు..
వ్యవసాయ కూలీలను కనీస భద్రత లేకుండా తరలిస్తున్నారు. సరుకు రవాణా వాహనాల్లో పరిమితికి మించి ఎక్కిస్తున్నారు. 8లో



పేరెంట్స్ పరేషాన్!
దానవాయిగూడెం గురుకులంలో చదువుతున్న తమ పిల్లలను చూసేందుకు ఉగాది పూట వచ్చిన తల్లిదండ్రులు తంటాలు పడ్డారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 24°

వాతావరణం
జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళ వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

ముస్లింలకు పొంగులేటి శుభాకాంక్షలు
ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలోని ముస్లింలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నెల రోజుల పాటు ఎంతో నిష్ఠతో ఉపవాసం ఉండి పవిత్రంగా జరుపుకునే పండుగ ఈద్ అని పేర్కొన్నారు. సహనం, త్యాగం, జాలి, దయ, సేవాగుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలంటూ దిశా నిర్దేశం చేసిన మాసం రంజాన్ అని తెలిపారు. పండుగను సంబురంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కాగా, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కూడా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ మరో ప్రకటన విడుదల చేశారు.

మే డే పురస్కారాలకు నామినేషన్ల ఆహ్వానం
ఖమ్మంమయూరిసెంటర్: మే డే సందర్భంగా ఇచ్చే శ్రమ శక్తి, పారిశ్రామిక ఉత్తమ యాజమాన్య పురస్కారాల కోసం ఏప్రిల్ 10వ తేదీలోగా నామినేషన్ ఫారాలు సమర్పించాలని ఉప కార్మిక కమిషనర్ కె.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. కార్మికుల సంక్షేమం కోసం విశిష్ట సేవలు అందించిన కార్మికులు, ట్రేడ్ యూనియన్ల నాయకులకు శ్రమ శక్తి పురస్కారాలు, ట్రేడ్ యూనియన్లు, కార్మికులతో సఖ్యతగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రగతికి సహకరించిన మధ్య, పెద్ద తరహా పారిశ్రామిక యాజమాన్యాలకు ఉత్తమ యాజమాన్య పురస్కారాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని ట్రేడ్ యూనియన్ల నాయకులు, కార్మికులు, యాజమాన్యాలు ఖమ్మం ఉప కార్మిక కమిషనర్ కార్యాలయంలో నామినేషన్ ఫారాలు తీసుకుని పూర్తిచేశాక 10వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు.

బీసీ అభ్యర్థులకు ఉచిత బ్యాంకింగ్ శిక్షణ
ఖమ్మం రాపర్తినగర్: హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యాన బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. నెల పాటు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇప్పించడమే కాక ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న బీసీ అభ్యర్థులు ఏప్రిల్ 8లోగా దరఖాస్తు చేసుకుంటే 12న ఆన్‌లైన్ ట్రెనింగ్ టెస్ట్ నిర్వహించి ప్రతిభ ఆధారంగా 30 మందిని ఎంపిక చేస్తామని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లోనైతే రూ.2 లక్షలలోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. వివరాల కోసం www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల ప్రవేశానికి 20న పరీక్ష
ఖమ్మంసహకారనగర్: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఏప్రిల్ 20న పరీక్ష నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి జిల్లా బీసీ గురుకుల విద్యాసంస్థల ప్రాంతీయ సమన్వయ అధికారి సీహెచ్.రాంబాబు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 24 బీసీ గురుకుల పాఠశాలలు ఉండగా, అందులో 6వ తరగతికి బాలికలకు 249, బాలురకు 249 సీట్లు, 7వ తరగతిలో బాలికలకు 170, బాలురకు 177, 8వ తరగతిలో బాలికలకు 97, బాలురకు 124, 9వ తరగతిలో బాలికలకు 139, బాలురకు 184 సీట్లు ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు రూ.150 రుసుముతో ఈనెల 31వ తేదీ(సోమవారం) లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉషూలో అన్నాచెల్లెలికి పతకాలు



క్రీడాకారులతో డీవైఎస్‌ఓ, కోచ్

ఖమ్మం స్పోర్ట్స్ : జాతీయస్థాయి ఫెడరేషన్ కప్ ఉషూ టోర్నీలో ఖమ్మం నగరానికి చెందిన అన్నాచెల్లెలుకు పతకాలు లభించాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో ఈనెల 24 నుంచి 28 వరకు జరిగిన పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించి పతకాలు దక్కించుకోవడం విశేషం. ఈ పోటీల్లో పి.పవిత్రాచారికి నాన్‌క్వాన్, ట్రెడిషనల్ సింగిల్ వెపన్‌లో కాంస్య పతకం లభించగా, పి.సత్యజిత్ చారికి తైజిక్వాన్‌లో కాంస్య పతకం దక్కింది. జాతీయస్థాయిలో వీరు ప్రతిభ కనబర్చగా డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి అభినందించారు.

జమలాపురంలో బ్రహ్మోత్సవాలు షురూ..



తీర్థపు బిందె తీసుకొస్తున్న అర్చకులు, పక్కన ఆలయ అధికారులు

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీవారికి అర్చకులు సుప్రభాత సేవ నిర్వహించి పంచామృతంతో అభిషేకం చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని, శ్రీఅలివేలు మంగ, శ్రీ పద్మావతి అమ్మవార్లను నూతన వస్త్రాలతో సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి వేపపువ్వు ప్రసాదం నివేదించారు. ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణి నుంచి ఈఓ కె.జగన్మోహన్‌రావు, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ తదితరులు మేళతాళాలతో తీర్థపు బిందె తీసుకొచ్చారు. తొలుత విష్వక్సేన పూజ చేసి పుణ్యావాచనం, అనుష్ఠానాలు, రుత్విక్కరణ తదితర పూజలు చేశారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని అర్చకులు, వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. అంతకుముందు శ్రీవారి నిత్య కల్యాణం నిర్వహించగా భక్తులు కనులపండువగా తిలకించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు, ఉగాదిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అర్చకులు వేపపువ్వు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్తలు ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, కృష్ణమోహన్‌శర్మ, వకుళామాత స్టేడియం నిర్మాణ దాత తుళ్లూరు కోటేశ్వరరావు, ఆలయ సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి పాదానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

మక్క రైతులకు భరోసా

- మార్క్‌ఫెడ్ ద్వారా పంట కొనుగోళ్లకు రంగం సిద్ధం
- ఉమ్మడి జిల్లాలో 55 కేంద్రాలకు పైగా ఏర్పాటు
- ఈ వారంలోనే పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌ల ద్వారా కొనుగోళ్లు

ఖమ్మం వ్యవసాయం: యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికందుతోంది. మక్కలకు ప్రైవేటు మార్కెట్‌లో కనీస మద్దతు ధర లభించడం లేదు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం మక్కలు క్వింటాకు రూ.2,225 ధర ప్రకటించగా, వ్యాపారులు రూ.2వేల నుంచి రూ.2,100 మించి చెల్లించడం లేదు. దీంతో పంట కొనుగోలుకు ప్రభుత్వం రంగంలోకి దిగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పంట సాగు చేసే ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో మక్కలు కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్‌ను ప్రభుత్వం ఆదేశించగా.. రాష్ట్రంలో పంట సాగు ఆధారంగా 320 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ కొనుగోళ్లు మొదలుకానున్నాయి.

1.30లక్షలకు పైగా ఎకరాల్లో సాగు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా మొక్కజొన్న విస్తారంగా సాగు చేశారు. ఖమ్మం జిల్లాలో 1,14,901 ఎకరాల్లో, భద్రాద్రి జిల్లాలో 16,938 ఎకరాల్లో పంట సాగైంది. ఎకరాకు 35 క్వింటాళ్ల చొప్పున రెండు జిల్లాల్లో దాదాపు 5.50 లక్షల క్వింటాళ్ల మక్కలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యాన 55కు పైగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్క్‌ఫెడ్ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో ఖమ్మం జిల్లాలో 44, భద్రాద్రి జిల్లాలో 11 నుంచి 15 కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి.

పీఏసీఎస్, డీసీఎంఎస్‌కు బాధ్యతలు

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)ల ద్వారా మక్కలు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఖమ్మం జిల్లాలో పీఏసీఎస్‌ల ద్వారా 38 కేంద్రాలు, డీసీఎంఎస్‌ల ద్వారా ఆరు కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో పీఏసీఎస్‌ల ద్వారా 11 నుంచి 15 కేంద్రాల ఏర్పాటు చేస్తారు.



విక్రయానికి ఆరబెట్టిన మొక్కజొన్నలు

వారం రోజుల్లో కొనుగోళ్లు..

పంట కోతలు, నూర్పిళ్లు ప్రారంభం కావడంతో ఏప్రిల్ మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. రవాణా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన మార్క్‌ఫెడ్.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఇప్పటికే పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై జిల్లా యంత్రాంగం దిశానిర్దేశం చేసింది.

మక్కల కొనుగోళ్లకు సమగ్ర చర్యలు



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మక్కల కొనుగోళ్లకు సమగ్ర చర్యలు చేపట్టాం. పంట సాగు చేసిన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్ సంస్థల ద్వారా పంట కొనుగోలుకు కార్యాచరణ చేశాం. నాణ్యతా ప్రమాణాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ. 2,225 మద్దతు ధరతో పంట కొనుగోలు చేస్తాం. ఏప్రిల్ మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. – సునీత, మేనేజర్ మార్క్‌ఫెడ్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

ఎక్కడెక్కడ..

- ఖమ్మం జిల్లాలో పీఏసీఎస్‌ల ద్వారా బ్రాహ్మణపల్లి, మోటమర్రి, కలకోట, లక్ష్మీపురం, రావినూతల, ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం, రామాపురం, పెద్దబీరవెల్లి, నారాయణపురం, బోనకల్, చిరునోముల, నాగులవంచ, పాతర్లపాడు, పొద్దుటూరు, పందిళ్లపల్లి, కొణిజర్ల, పెద్దమునగాల, పల్లిపాడు, రాజేశ్వరపురం, ముజ్జుగూడెం, మర్లపాడు, కందుకూరు, భరణిపాడు, మోటాపురం, జీళ్లచెరువు, ముదిగొండ, వనంవారి కిష్టాపురం, పెద్దమండవ, మేడేపల్లి, వీ.వీ.పాలెం, అల్లీపురం, తల్లాడ, మాధారం, కొండకొడిమ, సోమవరం, హస్నగుర్తి, కేశవాపురంలో కేంద్రాలు ఏర్పాటవుతాయి.
- డీసీఎంఎస్ ద్వారా రాయిగూడెం, అనాసాగరం, గువ్వలగూడెం, పెద్దగోపతి, తుమ్మలపల్లి, కొండాపురం, పమ్మి, లచ్చగూడెం గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.
- భద్రాద్రి జిల్లాలో పీఏసీఎస్‌ల ద్వారా టేకులపల్లి, ఆళ్లపల్లి గుండాల, మర్కోడు, శెట్టిపల్లి, కొత్తగూడెం, చల్లసముద్రం, కొమరారం, ఇల్లెందు, దమ్మపేట, అశ్వారావుపేటలో కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. అవసరమైతే మరో నాలుగు నుంచి ఐదు కేంద్రాల ఏర్పాటుకు కూడా ఈ జిల్లాలో అవకాశం ఉంది.

సంవత్సరాదికి ఘనంగా స్వాగతం

జిల్లా వ్యాప్తంగా విశ్వావసు నామ ఉగాది సందడి

ఖమ్మంగాంధీచౌక్ : విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగకు జిల్లా వాసులు ఘనంగా స్వాగతం పలికారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి ఇష్టదైవాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పంచాంగ శ్రవణం కార్యక్రమానికి హాజరయ్యారు. ఇళ్లకు మామిడాకు తోరణాలు కట్టి, షడ్రుచుల ఉగాది పచ్చడి తయారు చేసి స్వీకరించారు. రైతులు పశువులకు రంగులు చల్లి పూజలు చేశారు. జిల్లాలోని ప్రముఖ దేవాలయాలైన జమలాపురం, జీళ్లచెరువు గార్లొడ్డు ఆలయాలతో పాటు ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి, శ్రీ బ్రమరాంభ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి, కమాన్ బజార్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, కాల్వొడ్డులోని శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.



స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భక్తుల సందడి..



గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం..

నేడు ఈదుల్ ఫితర్



సత్తుపల్లిలో నమాజ్‌కు సిద్ధమైన ఈద్గా

రంజాన్ వేడుకలకు ముస్తాబైన మసీదులు, ఈద్గాలు

సత్తుపల్లి: 'అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్..' అంటూ నెల రోజులుగా ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు సోమవారం అత్యంత పవిత్రంగా, భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగను జరుపుకోనున్నారు. ఈదుల్ ఫితర్ సందర్భంగా పరస్పరం 'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. షవ్వాల్ చాంద్(నెలవంక) ఆదివారం రాత్రి చూడగానే ఈదుల్ ఫితర్(రంజాన్) పండుగ ఏర్పాట్లలో ముస్లింలు నిమగ్నమయ్యారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింల సందడితో పండుగ శోభ సంతరించుకుంది. జిల్లాలోని ఈద్గాలన్నింటినీ ముస్తాబు చేశారు.

నెల రోజుల కఠిన ఉపవాస దీక్ష..

30 రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు రంజాన్ పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారు. తప్పనిసరిగా తెల్లవారుజామున 'ఫజర్' నమాజ్ ఆచరించి ఈదుల్ ఫితర్ నమాజ్ చదవాల్సి ఉంటుంది. నమాజ్‌కు వెళ్లే ముందు పవిత్రంగా(గుసూల్) తల స్నానం చేసి కొత్త దుస్తులు ధరించి, అత్తరు పూసుకుంటారు. తప్పని సరిగా సేమియా(ఏదైనా తీపి పదార్థం) తిని వజూ చేసుకుని నమాజ్ కోసం ఈద్గాలకు వెళ్తారు.



విధిగా ఫిత్రా దానం..

ఫిత్రాల పేరుతో ఈ పండుగను 'ఈదుల్ ఫితర్'గా పిలుస్తుంటారు. ఆర్థికంగా ఉన్నవారు ఫిత్రా (దానం) తప్పనిసరిగా చెల్లించి ఈదుల్ ఫితర్ నమాజ్ చదవాలి. పండుగ రోజు పుట్టిన బిడ్డకు కూడా ఫిత్రా దానం ఇవ్వాల్సి ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో రెండున్నర కిలోల గోధుమల ధర ఎంత ఉంటుందో అంత ఫిత్రా చెల్లించాలి. ప్రస్తుతం ఒక్కొక్కరికి రూ.80చొప్పున ప్రతి ఒక్కరు ఫిత్రా చెల్లించాలని ముస్లిం మతపెద్దలు నిర్ణయించారు. అయితే అంతకంటే ఎక్కువ కూడా ఇవ్వవచ్చు. ఫిత్రా దానంతో పేదలు కూడా సంతోషంగా పండుగ జరుపుకునే అవకాశం ఉంటుంది.

ప్రజారంజక పాలన అందిస్తున్నాం

- ప్రజలకు సంక్షేమ ఫలాలు దక్కుతున్నాయి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రజా పాలన ఫలాలు దక్కేలా జన రంజక పాలన అందిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండలంలోని కాచారం, కొత్త గోపవరం గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆయన పర్యటించారు. రైతులు, మహిళలు, చిన్నారులు ఇలా అన్ని వర్గాల వారినీ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని చెప్పారు. కాచారంలో విద్యుత్ సరఫరా ఎలా ఉంది.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడగగా.. గ్రామంలో 200 వరకు కుటుంబాలు ఉన్నాయని, గత ప్రభుత్వం కంటే ఇప్పుడు విద్యుత్ సరఫరా చాలా నాణ్యతగా వస్తోందని స్థానికులు చెప్పారు. రైతు భరోసాపై ఆరా తీయగా నాలుగైదు ఎకరాలకు వరకు డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడ్డాయని తెలిపారు. గ్రామానికి రేషన్ దుకాణం, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరగా, భట్టి సానుకూలంగా స్పందించారు. అనంతరం కాచారం గ్రామ శివాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరావు, డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ సభ్యుడు శీలం ప్రతాపరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, నాయకులు బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, అనుమోలు కృష్ణారావు, మల్లెల లక్ష్మణరావు, గంటా తిరుపతమ్మ, శీలం శ్రీనివాసరెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి, దేవరకొండ రాజీవ్‌గాంధీ, గుడేటి బాబురావు, పిల్లి బోస్ పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం భట్టికి హారతి ఇస్తున్న మహిళలు

నేటి గిరిజన దర్బార్ రద్దు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏలో ప్రతి సోమవారం నిర్వహించే గిరిజన దర్బార్ కార్యక్రమాన్ని ప్రభుత్వ సెలవు రోజు కావడంతో రద్దు చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలోని యూనిట్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండరని, గిరిజనులు గమనించి అర్జీలు సమర్పించేందుకు కార్యాలయానికి రావద్దని కోరారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చేయూత

ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్

బూర్గంపాడు : గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తామని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. ఆదివారం ఆయన బూర్గంపాడు, భద్రాచలం, అశ్వాపురంలో పర్యటించారు. ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించాక, దమ్మక్క జాయింట్ లయబిలిటీ గ్రూప్ మహిళలకు వ్యాపార విస్తరణ కోసం రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఆ తర్వాత బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో 60శాతం రాయితీతో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ నరసింహా ఎగ్రో ఇండస్ట్రీని ప్రారంభించారు. అనంతరం అశ్వాపురం మండలం తుమ్మలచెరువులో సమ్మక్క–సారక్క మహిళా కందిపప్పు ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. గిరిజన యువత, మహిళల జీవనోపాధికి సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందిస్తామని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమలతో గిరిజనులు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఐటీడీఏ పీఓ రాహుల్, పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ధర స్థిరీకరణకు కేంద్రంపై ఒత్తిడి తెస్తాం

- వచ్చే ఉగాది నాటికి కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తాం
- లాభాలు ఎక్కువగా వచ్చే ఆయిల్‌పామ్‌పై రైతులు దృష్టి పెట్టాలి
- ఫ్యాక్టరీ శంకుస్థాపనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వేంసూరు: పామాయిల్ ధర స్థిరంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కల్లూరుగూడెంలో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ పనులకు ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఎండీ యాస్మిన్, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఉగాది నాటికి పనులు పూర్తి చేసి ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతీ పనికి ఆటంకం కలిగించాలని కొందరు చూస్తుంటారని, పనులు ఆగితే రాక్షసానందం పొందుతారని, సీతారామ కాల్వ తవ్వాలంటే రైతులను ప్రోత్సహించి స్టే తెప్పించారని విమర్శించారు. కొందరు బ్రోకర్లు నకిలీ మొక్కలు తెచ్చి.. ఇప్పుడు ఆయిల్‌ఫెడ్‌ను బదనాం చేయాలని చూస్తున్నారని అన్నారు. ఆయిల్‌ఫెడ్ నుంచి వచ్చే మొక్కల్లో కల్తీవి ఉండవని, విదేశాల నుంచి రావడంతో ఒకటో, రెండో ఉండవచ్చు తప్ప.. మొత్తంగా నకిలీవి ఉండే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సత్తుపల్లి ప్రాంతానికి జూన్‌లోగా గోదావరి జలాలు తీసుకొస్తామని, నాగార్జున సాగర్ నిండకున్నా గోదావరి నీటితో ఈ ప్రాంత చెరువులు నింపుతామని భరోసా ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందించి పది లక్షల ఎకరాలకు రెండు పంటలకూ సాగు నీరు అందిస్తామని ప్రకటించారు. ఆగస్టు 15 నాటికి జాతీయ రహదారి పనులు పూర్తవుతాయని, ఖమ్మం నుంచి 33 నిమిషాల్లో సత్తుపల్లికి వచ్చేలా కల్లూరు, వేంసూరులో ఎగ్జిట్‌లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఆయిల్ పామ్‌కు గిట్టుబాటు ధర రూ.21 వేలు దాటేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలు నిర్మిస్తామని తెలిపారు.



పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, పక్కన ఎమ్మెల్యే తదితరులు

వేంసూరు అభివృద్ధికి కృషి..

ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ.. ఎన్నికల హామీ మేరకు మంత్రి తుమ్మల వేంసూరు మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో మరింతగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 65వేల మంది రైతులు పామాయిల్ సాగు చేస్తున్నారని, వారిని ఒప్పించి 2.50లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగయ్యేలా చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో 30 వేల ఎకరాల్లో పంట సాగవుతోందని, ఏడాదికి 60 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని చెప్పారు. పామాయిల్ పంట కొనుగోలు చేశాక రైతుల ఖాతాల్లో మూడు రోజుల్లోనే డబ్బు జమయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్, తుమ్మల యుగంధర్, బొబ్బరపూడి రాఘవరావు, నరేంద్ర, పుచ్చాకాయల సోమిరెడ్డి, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాస్టర్ మృతికి నిరసనగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఖమ్మంగాంధీచౌక్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై క్రైస్తవుల ఫెలోషిప్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ మృతిపై అనుమానాలున్నాయని, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హోంమంత్రులు, పోలీస్ శాఖ అధికారులు ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు జకర్యా హన్మంతరావు, చల్లగుండ్ల రమేశ్‌బాబు, ఆనంద్, విజయ్‌కుమార్, డేవిడ్, శేఖర్‌బాబు, తిమోతి, వేముల సత్యం, నెలాల బాలస్వామి, కృష్ణ మోహన్, సంజీవరావు, పీటర్, చిన్న డేవిడ్, రవికిరణ్, జ్యోతి సుశీల, సేవకులు సైమన్, రాము, అభిషేక్, అశోక్ యోహాను, కిశోర్, పాల్, మోషే, సామేల్, నెహేమ్యా, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

- ఒకరికి గాయాలు

సత్తుపల్లిరూరల్: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన సత్తుపల్లి మండలం గంగారంలో ఆదివారం చోటుచేసుకుంది. గంగారానికి చెందిన కోటయ్య టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా అశ్వారావుపేట నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ట్రాలీ లారీ ఢీకొట్టింది. కోటయ్య కాలుకు తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

నేలకొండపల్లి: వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని యువకులు బైక్‌తో ఢీకొట్టడంతో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంబడించగా వారు పరారయ్యారు. మండల కేంద్రానికి చెందిన ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి డి.రామారావు ఆదివారం వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా కూసుమంచి – నేలకొండపల్లి రహదారిపై గుర్తు తెలియని యువకులు బైక్‌పై వస్తూ.. అక్కడ ఆరబెట్టిన మొక్కజొన్నల మీదుగా వెళ్లి బైక్ అదుపుతప్పి వెనుక నుంచి వచ్చి రామారావును ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, యువకులను స్థానికులు, పోలీసులు వెంబడించినా ఆచూకీ లభించలేదు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెనుబల్లి: మండలంలోని పాతకారాయిగూడెం ఎన్‌ఎస్‌పీ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. పాతకారాయిగూడెం ఎన్‌ఎస్‌పీ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా.. కుడి చేతిపై ఆంజనేయ స్వామి పచ్చబొట్టు ఉన్నట్టుగా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, విచారణ చేయనున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కండక్టర్ మృతి



సీతారాంప్రసాద్ (ఫైల్)

పెనుబల్లి: సత్తుపల్లి మండలంలోని కొత్త లంకపల్లి శివారులో రోడ్డుపై ఆగి ఉన్న లారీ ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కల్లూరుకు చెందిన వన్నపురపు సీతారాంప్రసాద్ (45) సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున విధులు పూర్తయిన సొంత ఊరికి వెళ్లడానికి, వైజాగ్ నుంచి ఖమ్మం వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు ఎక్కాడు. ఈ క్రమంలో బస్సు కొత్తలంకపల్లి శివారుకు చేరుకోగా, జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ఎడమ పక్కన భాగం అంతా ధ్వంసం కాగా కండక్టర్ సీతారాంప్రసాద్‌తో పాటు ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 దారా పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కండక్టర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉదయ్‌ను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా మరో ఇద్దరిని సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటుగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాల్సిన కుటుంబంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,871



రంజాన్ సందడి..

నెలవంక ఆదివారం సాయంత్రం దర్శనమివ్వడంతో సోమవారం రంజాన్ పండుగ జరుపుకోవాలని ముస్లిం మతపెద్దలు ప్రకటించారు. దీంతో ముస్లింలతా పండుగ సామగ్రి, వస్త్రాల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. ఖమ్మంలోని కమాన్‌బజార్, స్టేషన్ రోడ్ తదితర ప్రాంతాలు ఆదివారం సాయంత్రం రాత్రి పొద్దుపోయే వరకు కిటకిటలాడుతూ కనిపించాయి. గాజులు, అలంకరణ సామగ్రికి సంబంధించి పెద్ద సంఖ్యలో స్టాళ్లు ఏర్పాటు చేయడంతో ముస్లింలే కాక కులమతాలకు అతీతంగా పలువురు షాపింగ్ చేశారు. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సేమియా ప్యాకెట్లు కొనుగోలు చేస్తున్న మహిళలు



దుస్తులు కొనుగోలు చేస్తున్న యువకులు



ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్ రోడ్డులో షాపుల వద్ద రద్దీ

ఒకే వేదికపై రంజాన్, ఉగాది వేడుకలు

మధిర: ఒకే వేదికపై కులమతాలకు అతీతంగా ఉగాది, రంజాన్ పండుగలను ఘనంగా జరుపుకున్న ఘటన మధిర పట్టణంలోని టీచర్స్‌కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. టీచర్స్‌కాలనీలోని కులమతాలకు అతీతంగా హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు అందరూ కలిసి అన్ని పండుగలను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఆదివారం ఉగాది పండుగ రావడం మరుసటి రోజు రంజాన్ పండుగ రావడంతో రెండు పండుగలను కలిపి ఒకే వేదికపై చేసుకోవాలని కాలనీవాసులు నిర్ణయించుకున్నారు. ఈ కాలనీలో ఒక వేదికను ఏర్పాటు చేసి ఉగాది పండుగకు సంబంధించిన పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడిని అందరికీ అందజేశారు. అనంతరం రంజాన్ పండుగను పురస్కరించుకొని సేమియా పంపిణీ చేశారు. ఆయా పండుగల విశిష్టతను కాలనీ పెద్దలు వివరించారు. కార్యక్రమంలో దేవరకొండ లక్ష్మణ్ బాబు, వెలగపూడి హనుమంతరావు, యరమల వెంకటేశ్వరరెడ్డి, వైవి పున్నారెడ్డి, సాంబయ్య, చీకటి నాగేశ్వరరావు, ముస్లిం పెద్దలు షేక్ నాగుల్ మీరా, షేక్ ఇబ్రహీం, ఎండి రఫీ, కాలనీ పెద్దలు పోతురాజు కృష్ణయ్య, తోట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణ్‌బాబు, వేదికపై హిందూ ముస్లింలు

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

- దీపారాధన చేసి తాళం వేసి వెళ్లిన యజమానులు
- మంటలు వ్యాపించి ఫ్లాట్ పూర్తిగా దగ్ధం

ఖమ్మంక్రైం: నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో మంటలు చెలరేగి ఫ్లాట్ పూర్తిగా కాలిపోగా పైఅంతస్తు, పక్క ఫ్లాట్‌కు స్వల్పంగా నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తతో భారీ ప్రాణ నష్టం తప్పింది. వివరాలిలా ఉన్నాయి.. బుర్హాన్‌పురంలోని రవీంద్రనాథ్ ఠాగూర్‌నగర్‌లో ఇటీవల పిన్ని టవర్స్ నిర్మించారు. వీటిలో కొన్ని ఫ్లాట్లను కొనుగోలు చేసినవారు నివాసం ఉంటున్నారు. 301 ఫ్లాట్ కొనుగోలు చేసిన సత్తిరెడ్డి ఇంకా గృహ ప్రవేశం చేయలేదు. కాగా, సత్తిరెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం పండుగ కావటంతో దేవుడి గదిలో దీపం వెలిగించి, పూజ చేసి తాళం వేసి ప్రస్తుతం ఉన్న ఇంటికి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. వారు వెళ్లిన కొద్దిసేపటి తర్వాత కిటికీలో నుంచి పొగలు రావడాన్ని ఎదురు ఫ్లాట్ వారు గమనించి, కిటికీలో నుంచి చూశారు. వారు అరుస్తూ మంటలను ఆర్పేందుకు తమ ఇంట్లో నీళ్లను పోశారు. అయినా కూడా మంటలు అదుపులోకి రాలేదు. చివరకు వారు నివసిస్తున్న ఫ్లాట్‌కు సంబంధించిన అద్దాలు సైతం మంటల తాకిడికి పగిలిపోయాయి. దీంతో వారు ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకొని వాచ్‌మెన్‌కు సమాచారం అందించగా.. అతను వచ్చి చూడగా అప్పటికే మంటలు పైఅంతస్తులోకి వ్యాపిస్తున్నాయి. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా వారు వచ్చారు.

తప్పిన ప్రాణనష్టం..

ఘటనా స్థలానికి చేరుకొన్న ఫైర్ సిబ్బంది అపార్ట్‌మెంట్‌లో ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అందరినీ కిందకు వెళ్లాలని ఆదేశించారు. మెట్ల మార్గం ద్వారా పైకి చేరుకొని మంటలను ఆర్పుకుంటూ ఆరు కుటుంబాల వారిని క్షేమంగా కిందకు తీసుకొచ్చారు. ఒక ఫైరింజన్ సరిపోకపోవడంతో మరో ఫైరింజన్‌ను రప్పించారు. మహబూబాద్ జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనాథ్ రెస్క్యూ సిబ్బందిని పైకి తీసుకెళ్లి.. ఆయనే స్వయంగా మంటలను ఆర్పివేశారు. రెండు గంటలపాటు శ్రమించి, మంటలను అదుపులోకి తీసుకురావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఈ ఘటనతో అపార్ట్‌మెంట్‌వాసులు భయాందోళనకు గురయ్యారు. గంటలోనే అంతా జరిగిపోయిందని అపార్ట్‌మెంట్ వాసులు తెలిపారు. ఇదిలా ఉండగా తాము దీపం వెలిగించలేదని షార్ట్ సర్క్యూట్ ద్వారా అగ్ని ప్రమాదం సంభవించి ఉండవచ్చని సత్తిరెడ్డి తెలిపారు. ఘటనా స్థలాన్ని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి అజయ్ సందర్శించారు. ఖమ్మం ఫైర్ అధికారి బాలకృష్ణ, సిబ్బంది భాస్కర్‌రావు, కిరణ్‌కుమార్, రాంబాబు, నరసింహారావు, విజయ్ కుమార్, టూటౌన్ పోలీసులు మంటలన ఆర్పడంతో సఫలీకృతమయ్యారు. కాగా, సుమారు రూ.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.



ఫ్లాట్ నుంచి భారీగా వస్తున్న పొగలు



ప్రమాదంలో కాలిపోయిన ఇంటీరియర్

గాలిలో ప్రాణాలు...

రవాణా వాహనాల్లో ప్రయాణికుల తరలింపు

- అదనపు లోడ్‌కు తోడు డ్రైవర్ల మితిమీరిన వేగం
- వ్యాన్లు, ట్రాక్టర్లలో సామర్థ్యానికి మించి తీసుకెళ్తుండడంతో ప్రమాదాలు
- కూలీకి వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్న పేదలు

ఖమ్మం క్రైం: రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు వారివి. ఇంటోభార్య, భర్త పనిచేస్తేగాని నోట్లోకి అన్నం వెళ్లలేని పరిస్థితి. అందుకోసం చద్దిమూట కట్టుకోని కూలీ పనులకు భర్త ఒక దిక్కు, భార్య ఓ దిక్కు వెళ్లుతుంటారు. ఈకూలీపనులకు వెళ్లి వచ్చే వరకు తమ ప్రాణాలకు గ్యారెంటీ లేకున్నా ఆవిషయం తెలిసికూడా ఇంట్లో పోయ్యి వెలగటం కోసం, తమ బిడ్డల కనీస అవసరాలను తీర్చడం కోసం దూరప్రాంతాలకు వాహనాలలో ప్రయాణం చేసి మరి మిరపతోటలకు వెళ్లుతున్నారు. ఈక్రమంలో తమను తీసుకొని వెళ్లే వాహనాల డ్రైవర్ల నిర్లక్ష్య డ్రైవింగ్‌కు బలవుతున్నారు. ఇటీవల కాలంలో మిరపతోటలకు వెళ్లే కూలీల వాహనాలు తరుచుగా ప్రమాదాలకు గురి అవుతున్నాయి.

10మందికి 30మందికి పైగా...

వేసవి కాలంలో మిరపతోటలో కూలీ పనిచేయడానికి ఎక్కువమంది కూలీలు అవసరం అవుతారు. దీంతో మిర్చితోట యజమానులు తమ ప్రాంతానికి చెందిన ట్రాలీలు, టాటా ఏస్‌ల డ్రైవర్లతో కూలీలను తీసుకొచ్చి, మళ్లీ వారిని దింపి వచ్చేదానికి కాంట్రాక్ట్ పద్ధతిపై ఒప్పందం చేసుకోంటారు. దీంతో ట్రాలీలు, టాటాఎస్‌లు నడిపే డ్రైవర్లు కూలీలు ఎక్కువగా నివసించే ప్రాంతాలు, గ్రామాల దగ్గరనుంచి, పట్టణాలు, చివరకు నగరాల నుంచి కూడా కూలీలను తీసుకోనివెళ్లుతుంటారు, వీరిలో అత్యధికంగా మహిళ కూలీలు ఉంటారు. వాస్తవానికి వారి వాహనాలలో 10నుంచి 12మంది మాత్రమే పట్టే ఖాళీగా ఉంటుంది. అయితే వీరు డిజిల్, పెట్రోల్‌తోపాటు ట్రిప్పులు తిరగటానికి ఇష్టంలేక డబ్బులకు కక్కుర్తిపడి ఒకేసారి 30మందికిపైగా కూలీలను కిక్కిరిసే విధంగా ఎక్కించి తీసుకెళ్లి, పని ముగిశాక మరలా అదే మాదిరిగా తీసుకొస్తున్నారు.

మితిమీరిన వేగం, అధిక ఓవర్ లోడ్

కూలీలను తీసుకోని వచ్చే వాహనాల డ్రైవర్లు ఇష్టారాజ్యంగా రోడ్లపై వాహనాలను నడుపుతున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ , వాహనంలో పెద్దగా స్పీకర్‌లు పెడుతూ మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతుండటంతో వాహనాలు అధికలోడ్‌తో ఉండటంతో అదుపు తప్పి క్రింద పడిపోతున్నాయి. దీంతో ట్రాలీలో కూర్చోటానికి స్థలం లేక నిలబడే ఉండే కూలీలు క్రిందపడిపోయి కొంతమంది మత్యువాత పడిపోతుండగా మరికొంతమంది క్షతగాత్రులు అవుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వీరి కుటుంబాలు ఈఘటనలతో నిరాశ్రయులుగా మిగిలిపోతున్నారు.

పట్టించుకోని రవాణాశాఖ, పోలీస్‌శాఖ

రోడ్లపై ఓవర్‌లోడ్‌తో కూలీలను తీసుకోని వెళ్లేవాహనాల గురించి రవాణాశాఖ, పోలీస్ శాఖలు పట్టించుకోకపోవడంతో వారు తమ ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతూ కూలీల ప్రాణాలు గాలిలో పెట్టి నడుపుతున్నారు, వెంటనే పోలీస్, రవాణాశాఖ పట్టించుకోని ఓవర్‌లోడ్‌తో తీసుకొని వెళ్లతున్న వాహనాలపై కొరడా ఝుళిపించి జరిమానా విధించి వాటిని సీజ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటో ట్రాలీలో సామర్థ్యానికి మించి మహిళా కూలీలు (ఫైల్)



బోనకల్ మండలంలో బోల్తాపడిన ట్రాక్టర్ (ఫైల్)

- కొద్దిరోజుల క్రితం బోనకల్ మండలంలో మహిళా కూలీలతో వెళ్తున్న వాహనం బోల్తా పడగా ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనలో మరికొందరు గాయపడ్డారు.
- గత గురువారం ఖమ్మం రూరల్ మండలంలోనూ వాహనం బోల్తా కొట్టగా కూలీలకు గాయాలయ్యాయి.
- ఏన్కూరు మండలం నుంచి గత శుక్రవారం మహిళా కూలీలను తరలిస్తున్న ట్రాలీ ఆటో బోల్తా పడింది. దీంతో పలువురు మహిళలు గాయపడ్డారు.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం....

ఆటోలు, ట్రాలీలు, టాటా ఏస్‌ల్లో సామర్థ్యానికి మించి కూలీలను తీసుకెళ్లవద్దని డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. దీన్ని అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఓవర్‌లోడ్‌తో వెళ్లినట్లు తేలితే భారీ జరిమానా విధించడమే కాక వాహనాలు సీజ్ చేస్తాం. ఇప్పటికే పలు వాహనదారులకు జరిమానా విధించాం.

–వరప్రసాద్, ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ

గ్రూప్–1 ఫలితాల్లో ప్రతిభ

ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–1 ఫలితాల్లో జిల్లా వాసులు సత్తాచాటారు. తాము ఎంచుకున్న లక్ష్యాన్ని ఎన్నో కష్ట, నష్టాలకోర్చి చేరుకున్నారు. పుస్తకాలతో గంటల తరబడి కుస్తీపడుతూ.. ఏమాత్రం సమయం వృథా చేయకుండా చదివి అనుకున్నది సాధించారు. ప్రస్తుత యువతకు ఎంతో స్ఫూర్తిగా నిలిచారు.

ఐఏఎస్ కావడమే లక్ష్యం

వైరా: సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఐఏఎస్ కావడమే లక్ష్యమని చెబుతున్న వైరాకు చెందిన యువతికి గ్రూప్–1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 129వ ర్యాంకు వచ్చింది. మల్టీజోన్–1లో 49వ ర్యాంకు సాధంచిన సంగెపు లక్ష్మీసాహితి తండ్రి వెంకటేశ్వరరావు ఎల్‌ఐసీలో బీమా ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. తల్లి కవిత గృహిణి. ఆమె 1 నుంచి 7వ తరగతి వరకు వైరా మధు విద్యాలయం, 8 నుంచి 10 వరకు ఖమ్మం రెజొనెన్స్ పాఠశాల, ఇంటర్ శ్రీచైతన్య కళాశాలలో చదివి డిగ్రీ హైదరాబాద్ నారాయణ కళాశాలలో చదివింది. పీజీ హైదరాబాద్ రామిరెడ్డి కళాశాలలో పూర్తిచేసింది. శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. 2021లో యూపీఎస్సీ పరీక్షకు హాజరైంది. 'రెండు సార్లు సివిల్స్ రాశాను. రెండోసారి రెండు మార్కులలో ర్యాంకు కోల్పోయాను. ఎప్పటికైనా సివిల్స్ సాధించడమే లక్ష్యం' అని లక్ష్మీసాహితి వివరించింది.



తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, కవితతో లక్ష్మీసాహితి

వరుస విజయాల రత్నేశ్వరనాయుడు

కామేపల్లి: గోవింద్రాల బంజరకు చెందిన గంగారపు సత్యనారయణ – జ్యోతిర్మయి దంపతుల చిన్నకుమారుడు రత్నేశ్వరనాయుడు గ్రూప్1లో రాష్ట్రస్థాయిలో 277వ ర్యాంక్, జోనల్‌స్థాయిలో 120వ ర్యాంక్ సాధించాడు. ఇటీవల విడుదలైన తెలంగాణ గ్రూప్స్ ఫలితాల్లో గ్రూప్–1, 2, 3, 4 ఫలితాల్లో సత్తాచాటాడు. తమ తండ్రి స్థాపించిన పాఠశాలలోనే తన సోదరుడు సాయికృష్ణమనాయుడుతో కలిసి రత్నేశ్వరనాయుడు 1 నుంచి 7వ తరగతి వరకు చదివాడు. ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో 10వ తరగతి వరకు చదివారు. ఇంటర్ సి.వి.రామన్, డిగ్రీ శ్రీచైతన్య హైదరాబాద్‌లో చదివాడు. ప్రస్తుతం రత్నేశ్వరనాయుడు ఖమ్మంలోని కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చినా వెళ్లలేదు.



కుటుంబ సభ్యులతో రత్నేశ్వరనాయుడు

గ్రూప్–1 ఫలితాల్లో సత్తా



సంజయ్

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని బూడిదంపాడుకు చెందిన తుమ్మలపల్లి సంజయ్ గ్రూప్–1 ఫలితాల్లో 469 మార్కులు సాధించి ఈడబ్ల్యూఎస్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంక్, జనరల్ విభాగంలో 249 ర్యాంక్ సాధించాడు. సంజయ్ తల్లితండ్రులు నర్సింహారావు, ఉమ బూడిదంపాడు గ్రామ సెంటర్‌లో హోటల్ నడుపుతున్నారు. సంజయ్ 1 నుంచి 5 వరకు బల్లేపల్లిలోని ఎస్‌ఎఫ్‌ఎస్‌లో, 10వ తరగతి వరకు ఖమ్మంలోని గీతమ్స్‌లో, ఇంటర్, డిగ్రీ, గ్రూప్స్ పరీక్షల కోసం నారాయణ ఐఏఎస్ అకాడమీలో కోచింగ్ తీసుకున్నట్లు సంజయ్ తండ్రి తెలిపారు. సంజయ్‌ను పలువురు అభినందిస్తున్నారు.

కానిస్టేబుల్‌గా చేస్తూనే..



సుజాత

కల్లూరురూరల్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్–1 ఫలితాల్లో కల్లూరు మండలంలోని పేరువంచ గ్రామానికి చెందిన మందాల సుజాత రాష్ట్రస్థాయిలో 27వ ర్యాంక్, ఎస్సీ రిజర్వేషన్ కేటగిరిలో 11వ ర్యాంక్ సాధించింది. సుజాత ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. గ్రూప్–1 కోసం కొంతకాలంగా సెలవుపెట్టి హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకొని పరీక్ష రాసింది. రాష్ట్రస్థాయిలో గ్రూప్–1 ఫలితాల్లో 27వ ర్యాంకు సాధించినందుకు గాను సుజాతను పలువురు అభినందించారు.

తల్లి కష్టంతో..



మురళి

ఖమ్మంమయూరిసెంటర్: చిన్ననాటి నుంచి తనను చదివించేందుకు తన తల్లి పడిన కష్టాన్ని ప్రతి క్షణం గుర్తు చేసుకుంటూ ఖమ్మం నగరం ఖానాపురానికి చెందిన ఎం.మురళి గ్రూప్–1 ఫలితాల్లో మెరిశాడు. రాష్ట్రస్థాయి 83వ ర్యాంకు, బీసీ–ఏ కేటగిరిలో 2వర్యాంక్, జోనల్‌స్థాయిలో 47వ ర్యాంకు సాధించాడు. మురళి ఇప్పటికే ఖమ్మం నగర పాలక సంస్థలో జూనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇప్పటి వరకు మురళి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. 2018లో టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్, 2020లో సివిల్ కానిస్టేబుల్, 2024లో జూనియర్ అకౌంటెంట్ (గ్రూప్–4) సాధించడంతోపాటు తాజాగా గ్రూప్–1 ఫలితాల్లో 489.5 మార్కులు సాధించాడు.మురళి తండ్రి లక్ష్మీనారాయణ 1998లో చనిపోగా.. తల్లి కళావతి కేఎంసీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తూ చదివించుకుంది. 2020లో తల్లి కళావతికి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఇంటి వద్దే ఉంచి ఆమె ఆలనాపాలనా మురళి చూస్తున్నాడు.

ఆరేళ్ల శ్రమ



రాహుల్

తల్లాడ: ఆరేళ్లుగా పడిన శ్రమ ఫలించింది. తల్లాడకు చెందిన చింతా రాహుల్ గ్రూప్–1లో 467.5 మార్కులు సాధించి ప్రతిభ చాటాడు. తల్లాడకు చెందిన చింతా రాజు, చంద్రకళ దంపతుల కుమారుడు చింతా రాహుల్ 2019లో సివిల్స్ లక్ష్యంగా ఢిల్లీలో వాజీరామ్ రవి ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నారు. ఆరేళ్లుగా కష్టపడి లక్ష్యాన్ని చేరుకున్నారు. రాహుల్ జనరల్‌లో 232వ ర్యాంక్, మల్టీజోన్‌లో 115 ర్యాంక్ సాధించాడు. ఎస్సీ రిజర్వేషన్‌లో 8వ ర్యాంక్ సాధించాడు. రాహుల్ 1 నుంచి 4వ తరగతి వరకు యూనివర్సల్ విద్యాలయం, 5 నుంచి 10 వరకు ఖమ్మం కేంద్రీయ విద్యాలయం, ఇంటర్మీడియట్ హైదరాబాద్ నారాయణ కళాశాల, బీటెక్ మల్లారెడ్డి కళాశాలలో చదివారు. తండ్రి రాజు ఏన్కూరు మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి గృహిణి. వృత్తిని దైవంగా భావిస్తానని రాహుల్ ఈ సందర్భంగా తెలిపాడు.

ఉద్యోగం చేస్తూనే..



గోపీకృష్ణ

ఖమ్మంక్రైం: ఖమ్మం ఏఎంవీఐగా పనిచేస్తున్న వెల్ది గోపీకృష్ణ గ్రూప్–1 ఫలితాల్లో సత్తాచాటాడు. జనరల్ కేటగిరిలో స్టేట్‌లో 70 ర్యాంక్, జోనల్‌లో 38 ర్యాంక్ సాధించారు. ఇటీవల రవాణాశాఖలో ఏఎంవీఐగా చేరిన గోపీకృష్ణ హనుమకొండ జిల్లాకు చెందినవారు. ఆయన గ్రూప్–1 పరీక్ష రాసే సమయంలో తండ్రి నాగేశ్వరరావు హఠాన్మరణం పొందారు. అయినా కష్టపడి చదివి గ్రూప్–1 ఫలితాల్లో ర్యాంక్ సాధించాడు. గోపీకృష్ణ ఇప్పటివరకు 10 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఆయన్ను జిల్లా ఇన్‌చార్జ్ రవాణాశాఖాధికారి వెంకటరమణ, ఎంవీఐ వరప్రసాద్, ఏఎంవీఐ స్వర్ణలత, ఇతర సిబ్బంది అభినందించారు.

పేరెంట్స్.. పరేషాన్!

ఉగాది పూట దానవాయిగూడెంలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలను చూడదానికి వచ్చిన తల్లిదండ్రులు ఆదివారం నానా తంటాలు పడ్డారు. పండగకు పిండి వంటలు, ఇతరత్రా వంటకాలు తీసుకుని పాఠశాల వద్దకు వచ్చిన తల్లిదండ్రులు తాము తీసుకొచ్చన తినుబండారాలను వారివారి పిల్లలకు ఇద్దామనుకుంటే ప్రిన్సిపాల్ దుర్గ ఒప్పుకోలేదు. దీంతో ఎలాగైనా తమ పిల్లలకు ఇచ్చిపోవాలని గోడలపై నుంచి, గేట్ కింది నుంచి ఇదిగో ఇలా నానా ప్రయత్నాలు చేశారు. అయినా కుదరకపోవడంతో సాయంత్రం వరకు మండుటెండలో వేచి ఉన్నారు. చివరకు కలెక్టర్ సీసీకి ఫోన్‌లో విషయం చెప్పడంతో 4గంటల తర్వాత అర్ధగంట సమయం కేటాయించడంతో వారు తెచ్చిన వాటిని ఇచ్చి వెనుదిరిగారు. – ఖమ్మంరూరల్



పిల్లలను చూసేందుకు గేట్ ఎక్కుతున్న ఓ పేరెంట్



తమ పిల్లల కోసం గోడ పైనుంచి చూస్తున్న తల్లిదండ్రులు